క్లుప్తంగా

త్రోబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో విద్యార్థులు

మదనపల్లె సిటీ : గుంటూరులో రీజియన్ గేమ్స్, స్పోర్ట్స్ నిర్వహించిన అండర్–17 త్రోబాల్ పోటీల్లో స్థానిక వేద పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 16 టీంలు పాల్గొన్నాయి. ఇందులో వేదా పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి మొదటి స్థానం నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేంద్రరెడ్డి తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ లక్ష్మీనారాయణరెడ్డి, పీడీలు అభినందించారు.

కేశాలు దానం చేసిన విద్యార్థి



కేశాలు దానం చేస్తున్న జోషిత

మదనపల్లె సిటీ : క్యాన్సర్ బాధితుల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం మదనపల్లెకు చెందిన డైరీ డే ఐస్ క్రీం చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె జోషిత హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా కేశాలను దానం చేశారు. నిర్వాహకురాలు అబుబకర్‌సిద్దిక్ వీరికి పూల మొక్కలను అందించి అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు కిరణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి


యశోదమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి

కలకడ : కలికిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బరకం రవికుమార్‌రెడ్డి, తల్లి బరకం యశోదమ్మ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం అనారోగ్యంతో యశోదమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామచంద్రారెడ్డి గుడిబండ గ్రామంలో మంగళవారం యశోదమ్మ మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో కడపజిల్లా డీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, గుడిబండ, కోన సర్పంచ్‌లు బరకం సునీత, రాజగోపాల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు కృష్ణకుమారి, కమలాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త


మురుగునీటిలో గంబుసియా చేపలు వదులుతున్న ఆరోగ్య సిబ్బంది

కేవీపల్లె : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి ముజీబ్‌బాషా సూచించారు. మంగళవారం గ్యారంపల్లె పీహెచ్‌సీ పరిధిలో దోమల లార్వా అంతం చేయడం లక్ష్యంగా చెరువుల్లో గంబుసియా చేపపిల్లలు వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎం.శ్యామల, వి. శోభారాణి, ఎస్. సుప్రియ, ఎస్. శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ప్లానింగ్ ఉంటే.. పరీక్ష సులువే


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి

మదనపల్లె సిటీ : ప్రణాళికతో చదివితే అనుకున్న విజయం సాధించడం సులభతరం అవుతుందని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో విద్యార్థులు పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అధ్యాపకుల సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. దంత వైద్యులు డాక్టర్ భవాని మాట్లాడుతూ దంతాలను రోజు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ముసురుతున్నాయి..!

- పడకేసిన పల్లెలు
- విజృంభిస్తున్న అతిసార, డయేరియా
- గ్రామాల్లో అధ్వాన్నంగా పారిశుద్ధ్యం
- జ్వరాలతో ఆస్పత్రి బాట పట్టుతున్న రోగులు
- వాతావరణ మార్పులు కారణమంటున్న వైద్యాధికారులు


వేంకటేశ్వరపురంలో కాలువలు లేక రోడ్లపైనే పారుతున్న మురుగునీరు


తురకపల్లెలో పూడిపోయిన మురుగుకాలువలు


మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఓపీ కోసం బారులు తీరిన రోగులు


జిల్లా ఆస్పత్రిలో మందుల కోసం క్యూలో నిల్చున్న బాధితులు

మదనపల్లె : డయేరియా (అతిసార).. ఈ పేరు వింటేనే ప్రజలు భయపడుతున్నారు. వాతావరణ మార్పు, వర్షాలు, నీటి కాలుష్యంతో డయేరియా ప్రబలుతోంది. దీంతో పల్లెలు పడకేస్తున్నాయి. ఎక్కడ... ఏ ఇంట్లో చూసినా మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాల మూలుగులే వినిపిస్తున్నాయి. నెలరోజులుగా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో అతిసార, డయేరియా వంటి రోగాలతో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. ప్రతి రోజు ఆస్పత్రిలో జ్వరాల బారిన పడిన రోగులు చికిత్స కోసం ఓపీలో వందల సంఖ్యలో బారులు తీరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు, కాలువల్లో పూడికలు తొలగించని కారణంగా దోమలు అధికమై ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు.

లోపించిన పారిశుద్ధ్యం

ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. అక్కడక్కడా తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు ఉన్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. పట్టణ శివారు పంచాయతీలైన కొత్తపల్లె, ఈశ్వరమ్మకాలనీ, కొత్త ఇండ్లు, కోళ్లబైలు, బసినికొండ, నిమ్మనపల్లె మండలంలోని తవళం, వెంగంవారిపల్లె, ముష్టూరు, పట్టణంలోని అమ్మచెరువుమిట్ట, చంద్రాకాలనీ, బుగ్గకాలువ, వైఎస్సార్ కాలనీ, మంజునాథకాలనీ, అనపగుట్ట తదితర ప్రాంతాల్లో మురుగు కాల్వల్లో పేరుకుపోయినప్పటికీ తొలగించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. చాలా కాలనీల్లో మురుగునీటి కాలువలు లేక రోడ్లపై మురుగునీరు పారుతోంది.

పెరుగుతున్న డయేరియా, అతిసార బాధితులు

జిల్లా ఆస్పత్రిలో డయేరియా, అతిసార బాధితులు రోజురోజుకు పెరుగుతున్నారు. మదనపల్లె డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీల్లో ఇప్పటివరకు 8 డయేరియా కేసులు, 2 డెంగీ కేసులు, దాదాపు 80 మంది వరకు జ్వరబాధితులు నమోదయ్యారు. ఇవి అధికారికంగా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలకు వచ్చిన రోగుల వివరాలైతే.. అనధికారికంగా ప్రైవేట్ ఆస్పత్రులు, బెంగళూరు, తిరుపతికి వెళ్లి చికిత్సలు చేయించుకుంటున్నవారు వందలసంఖ్యలోనే ఉంటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు రోగాల బారిన పడి బాధపడుతున్నారు. అయితే జబ్బులతో ఆస్పత్రికి వస్తే ఇక్కడా పరిసరాలు అపరిశుభ్రంగానే ఉన్నాయని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు



డయేరియా వ్యాధిపై ఇప్పటికే గ్రామాల్లో వైద్యసిబ్బందితో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఎంపీడీఓలు గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడం, పైప్‌లైన్ లీకేజీలు అరికట్టడం, కాల్వల్లో పూడికలు తొలగించడం, దోమల నివారణకు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితుల వివరాలను సేకరించడమే కాకుండా అవసరమైన వైద్య సహాయాన్ని అందిస్తున్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి, జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి.

– రమేష్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, మదనపల్లె.

శాకంబరీ అలంకరణలో నారసింహుడు


శాకంబరీ అలంకరణలో మూల మూర్తులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి విశేషమైన పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు నిర్మించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి రకరకాల కూరగాయలతో శాఖాలంకరణ చేశారు. అనంతరం భక్తుల దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

ఆంజనేయుడికి పూజలు


ప్రత్యేక అలంకారంలో గాండ్లవీధి అంజన్న

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గాండ్లవీధిలో వెలసివున్న ఆంజనేయస్వామి ఆలయం, ఇరిగేషన్ కార్యాలయం, టోల్‌గేట్ వద్దనున్న ఆంజనేయ స్వామి ఆలయాలలో మంగళవారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే భక్తులందరూ సహస్రనామాలతో అంజన్నకు ఆకుపూజ జరిపారు.

ఏపీఎండీసీ ఉద్యోగి హఠాన్మరణం


లక్ష్మీకాంత్ (ఫైల్)

ఓబులవారిపల్లి (రైల్వేకోడూరు అర్బన్) : ఏపీఎండీసీ మంగంపేటలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న గునిపాటి లక్ష్మీకాంత్ (34) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంచి భవిష్యత్తు ఉన్న లక్ష్మీకాంత్ చిన్న వయసులో మృతి చెందడం బంధువులు, స్నేహితులు, తోటి ఉద్యోగులు జీర్ణించుకోలేక ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ శశికళ

రాయచోటి అర్బన్ : రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సుండుపల్లె మండలం ఈడిగపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సీడీపీఓ డి.శశికళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రిజిస్టర్‌లను, పిల్లల హాజరుపట్టికను, పరిశీలించారు. పిల్లలకు గర్భిణులకు సరైన పోషకాహారాన్ని అందిస్తున్నారా ? లేదా? అంటూ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పిల్లలకు, గర్భిణులకు ఆహారం, వస్తువులను సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలంటూ అంగనవాడీ కార్యకర్తకు సూచించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరిస్తున్న వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు

నిమ్మనపల్లె : రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి మురళీమోహన్, హార్టికల్చర్ ఆఫీసర్ ఈశ్వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని రాచవేటివారిపల్లె, రెడ్డివారిపల్లె, బండ్లపై గ్రామాల్లో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సంయుక్తంగా పర్యటించి, పంట పొలాలను పరిశీలించారు. వేరుశనగ, టమాటా పంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షా ఫలితాల ఆవశ్యకతను వివరించారు. కౌలుకు భూములు తీసుకుని పంటలు సాగుచేస్తున్న రైతులకు కౌలురైతు కార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతుసేవాకేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు సహకరించండి

- గత ప్రభుత్వంలో రూ.150 కోట్ల ఖర్చు
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


బి.కొత్తకోట : ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని సత్కరిస్తున్న హౌసింగ్ అధికారులు

బి.కొత్తకోట : పేదలు నిర్మించుకుంటున్న పక్కా గృహాల నిర్మాణాలకు సహకరించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి శివయ్య, తంబళ్లపల్లె ఇన్‌చార్జి డీఈ వెంకటరెడ్డి, ఏఈలు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలో గృహ నిర్మాణాల స్థితిపై సమీక్షించారు. గత ప్రభుత్వంలో పేదలకు అత్యధికంగా ఇళ్లు మంజూరు చేయించామని గుర్తు చేశారు. వాటి నిర్మాణ పనులు పూర్తి చేయించడం కోసం ఎన్నికల సమయానికి రూ.150 కోట్ల దాకా ఖర్చు చేశామని తెలిపారు. ప్రస్తుతం వివిధ దశల్లోని పక్కా గృహ నిర్మాణాలను పూర్తి చేయించాలని కోరారు. లబ్ధిదారులకు సత్వరమే బిల్లుల మంజూరుకు కృషి చేయాలని సూచించారు. లేఅవుట్లలో లబ్ధిదారులకు సౌకర్యాలు కొనసాగించాలని కోరారు. గత ప్రభుత్వంలోనే లే అవుట్లలో విద్యుత్, నీటి వసతి కల్పించామని పేర్కొన్నారు.

బిజీ బిజీగా ఎమ్మెల్యే..

తంబళ్లపల్లెలోని నివాసంలో ఉన్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మంగళవారం బిజీ బిజీగా గడిపారు. నియోజకవర్గంలోని మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులు ఆయన కలిశారు. ప్రజలు వచ్చి సమస్యలపై విన్నవించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గం సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో ఏడు దశాబ్దాలుగా జరగని అభివృద్ధిని ఐదేళ్లలో చేసి చూపించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. అధికారంలో ఉండగా పార్టీలకు, రాజకీయాలకతీతంగా పనిచేసి అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించామని తెలిపారు.

సమాజ సేవ ప్రతిఒక్కరి బాధ్యత

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


విద్యార్థికి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె సిటీ : సమాజ సేవ ప్రతిఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ 40వ కాలేజీ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. కాలేజీలో అధ్యాపకులు మంచి శిక్షణ వలన ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. బాగా చదివి కాలేజీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌బాబు, అధ్యాపకులు ఖాజావల్లి, మోహన్‌వల్లి, జ్యోతి పాల్గొన్నారు.

పార్కును పరిశుభ్రంగా ఉంచండి


పార్కును పరిశీలిస్తున్న కమిషనర్, రాహుల్‌రెడ్డి, అధికారులు

రాయచోటి అర్బన్ : పట్టణంలో ఎన్‌జీఓ కాలనీలోని పార్కును పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, రాష్ట్రమంత్రి సోదరుడు రాహుల్‌రెడ్డి అధికారులను కోరారు. మంగళవారం వారు మున్సిపల్ అధికారులతో కలసి 18వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని పార్కును వారు పరిశీలించారు. పార్కును పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పిల్లలు ఆడుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా కాలనీ వాసుల సౌకర్యార్థం పార్కులో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలంటూ సూచించారు. వార్డులోని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చే సమస్యలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. పలు ప్రాంతాల్లో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే పక్కకు తొలగించడం ద్వారా ప్రజారవాణాకు ఆటంకం కలగకుండా చూడాలంటూ ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతోపాటు పలు ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా మొహర్రం ఉత్సవాలు


కందుకూరులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


తంబళ్లపల్లెలో..


కేవీపల్లె : చింతమాకులపల్లెలో పీర్ల ఊరేగింపు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులో గత వారం రోజులుగా మొహర్రం ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి జరిగిన పెద్దపీర్ల మెరవని ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్నాటక నుంచి కూడా ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. పీర్లను ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. బుధవారం జల్తి కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా మొహరం ఉత్సవం

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ చింతమాకులపల్లెలో మొహర్రం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చింతమాకులపల్లెలో హిందువులు ఒక రోజు మొహరం పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, డప్పులు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామంలో పీర్లను ఊరేగింపు చేపట్టారు. అనంతరం పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌నాయుడు, రామకృష్ణ, పీరయ్య, మణి, శివ, అంజి, రమణ, హరిబాబు, వెంకటరమణ, చాణక్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దపీరు మెరవణి

తంబళ్లపల్లె : హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ పెద్ద పీరుకు పూలబాసికం అందజేశారు. పలువురు అగ్నిగుండ ప్రవేశం చేశారు. పెద్దపీరును పూలబాసికాలతో అలంకరించిన పురవీధుల్లో ఊరేగించారు. పరిసర ప్రాంతాల గ్రామస్తులు పెద్దపీరు మొరవణిలో పాల్గొన్నారు.

కుష్టును అరికట్టేలా..!

కుష్టువ్యాధి ప్రాణాంతమైనది కానప్పటికీ.. నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంగవైకల్యాన్ని కల్గించగల మహమ్మారి. గతంలో అంతంత మాత్రంగానే ఉన్న ఈ వ్యాధి ఇప్పుడు పెరుగుతున్నట్లు వైద్యాధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులోభాగంగా వ్యాధిని కట్టడి చేసేందుకు వైద్యశాఖ ప్రణాళికలు రచిస్తోంది. ఏటా పదుల సంఖ్యలో కొత్త కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. అయితే వ్యాధి నివారణకు ప్రభుత్వం చేపడుతున్న అవగాహన కార్యక్రమాలతో వ్యాధి కాస్త తగ్గుముఖం పడుతోంది. ప్రతి ఏటా ప్రభుత్వం సర్వే చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

- రేపటి నుంచి ఆగస్టు 2 వరకు లెప్రసీ సర్వే
- 14 రోజుల పాటు ఇంటింటి పరిశీలన
- గుర్తింపు అనంతరం మందుల పంపిణీ


వాల్మీకిపురం : శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీవిద్య


కలకడ : సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జవహర్‌బాబు


పీలేరు : అవగాహన ర్యాలీలో ఆరోగ్య అధికారులు, సిబ్బంది


తంబళ్లపల్లె : మాట్లాడుతున్న ఏపీఎం వేణుగోపాల్

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి సీహెచ్‌సీ పరిధిలో ఇంటింటి కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు సర్వేను జాగ్రత్తగా చేద్దామని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీవిద్య సూచించారు. మంగళవారం చింతపర్తి పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటి కుష్టువ్యాధి గ్రస్తుల సర్వే చేయాలన్నారు. స్పర్శలేని మచ్చలు, మచ్చ పైభాగంలో వెంట్రుకలు మొలచకపోవడం, చమట పట్టకపోవడం, తక్కువ మచ్చలు ఉంటే 6 నెలలు, ఎక్కువ మచ్చలు ఉంటే ఆరు నుంచి సంవత్సరం పాటు మందులు క్రమం తప్పకుండా వాడితే వ్యాధి తీవ్రత తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుధాకర్, మహమ్మద్ రఫీ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య వివరాలు సేకరించండి

కలకడ : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రతి ఇంటిని ఆరోగ్య కార్యకర్తలు, మేల్‌వర్కర్లు విధిగా సందర్శించి పూర్తి వివరాలను నమోదు చేయాలని డాక్టర్ జవహర్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ ఆరోగ్య, ఆశాకార్యకర్తలు, మేల్‌వర్కర్లు టీంగా ఏర్పడి పొడలు, దద్దుర్లు, చర్మవ్యాధులు ఉంటే వాటి లక్షణాలు గుర్తించడానికి ప్రభుత్వ ఆసుపత్రికి పంపాలని సూచించారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే మల్టి డ్రగ్స్ వినియోగించి ప్రారంభ దశలోనే మందులతో అంగవైకల్యం రాకుండ నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, యంపీహెచ్‌ఎస్ వెంకటేశ్వరరావు, పీహెచ్‌ఎన్ సుబ్బరత్న, సిబ్బంది అశ్విని, లావణ్య, రాజసులోచన, వాణిశ్రీ, లక్ష్మి, వరలక్ష్మి, మేల్‌వర్కర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి ఏ దశలో ఉన్నా నయమవుతుంది

పీలేరు : కుష్టు వ్యాధి ఏ దశలో ఉన్నా నయమవుతుందని డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తలపుల పీహెచ్‌సీ పరిధిలో కుష్టు వ్యాధులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించాలన్నారు. స్పర్శలేని మచ్చల రూపంలో ఉండే కుష్టు వ్యాధి ఏ దశలో ఉన్నా మందులతో నయం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, హెచ్‌ఈ కొండయ్య, పర్యవేక్షకులు శ్రీను, కృష్ణయ్య, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలి

తంబళ్లపల్లె : వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పని చేసి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలని ఏపీఎం వేణుగోపాల్ సూచించారు. మంగళవారం బూదలవారిపల్లె సబ్ సెంటర్ పరిధిలో వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించే అవగాహన కార్యక్రమాలు విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఎవరికైనా స్పర్శలేని తెల్లమచ్చలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మునికుమార్, సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.